క్లుప్తంగా

మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అరుణోధర్

కనిగిరిరూరల్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో స్థానిక విజేత ఐఐటీ నీట్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. నెలకుర్తి అనుష్క 87 శాతం, సానికొమ్ము ప్రహర్షరెడ్డి 83 శాతం, గడా కీర్తన 74 శాతం సాధించినట్లు విజేత విద్యాసంస్థల అధినేత పసుపులేటి అరుణోధర్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు వేములు శ్రీరాములు, కాకర్ల మాధవరావు, సిబ్బంది అభినందించారు.

వాటర్‌ఫ్రిజ్‌ల ఏర్పాటు అభినందనీయం



వాటర్‌ఫ్రిజ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ కార్యాలయాలకు దాతలు వాటర్‌ఫ్రిజ్‌లు ఏర్పాటుచేసి తాగునీటి వసతి కల్పించడం అభినందనీయమని తహసీల్దార్ మంజునాథరెడ్డి అన్నారు. దాత చెరుకుపల్లె వెంకటరెడ్డి తన సొంత నిధులు రు.30 వేలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం, సీఎస్‌పురం, ఉప్పలపాడు సచివాలయాలకు వాటర్‌ఫ్రిజ్‌లు సమకూర్చగా వాటిని శనివారం తహసీల్దార్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఖాజారఫీ, సిబ్బంది కె.పద్మనాభం, వీఆర్‌ఓ విష్ణు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం రైతులకు మేలు



రైతులను సన్మానిస్తున్న ట్రైనర్ ఎస్తేరమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు కలుగుతుందని మాస్టర్ ట్రైనర్ ఎస్తేరమ్మ అన్నారు. మండలంలోని నేతివారిపాలెం గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కషాయాలను ఏ విధంగా తయారు చేయాలో వివరించారు. ఉత్తమ రైతులైన మన్నెం వెంకటేశ్వర్లను బొల్లా బ్రహ్మయ్యను సన్మానించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ప్రకృతి వ్యవసాయ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. యూనిట్ ఇంచార్జ్ మందాకిని, ఎల్ టూ రంజిత్, మాధవ ఐసీఆర్‌పీలు జ్యోత్స్న, విజయలక్ష్మి, మాలకొండయ్య, ప్రధానోపాధ్యాయుడు సీతారామయ్య, సర్పంచ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లి బిడ్డ ఆరోగ్యం



రెడ్డిపాలెంలో గర్భిణులకు సీమంతం

కనిగిరిరూరల్: పోషకాహారంతోనే తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం వీఎస్ పార్వతి అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బల్లిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీ ఎస్ పార్వతీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారం గురించి వివరించారు. హెచ్‌ఎం కె.కొండారెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూపర్‌వైజర్ ఎల్ విజయ అన్నారు. జరుగుమల్లి మండలం రెడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు.

కాల్వల నిర్మాణం చేపట్టాలని వినతి

టంగుటూరు: అరుంధతి నగర్ కాలనీలో కాలువల నిర్మాణం చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బక్కా తిరుమలరావు శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరు పంచాయతీకి నిధులు మంజూరైనా కేవలం అగ్రవర్ణాలు నివాసం ఉండే ప్రాంతాలకే సిమెంట్ రోడ్లు వేస్తున్నారన్నారు. అరుంధతగనగర్‌లో సైతు కాలువలు లేకపోవడంతో వర్షం నీరు, మురుగునీరు పారక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మురుగునీటితో దోమలు ప్రబలి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాల్వల నిర్మాణం చేపట్టాలని కోరారు.

కరెంటు ఇచ్చి కనికరించండి సారూ..!

- వారం నుంచి రైతుల ఇబ్బందులు
- కరేడు రెవెన్యూ పరిధిలో మామిడి, వరి రైతుల ఆవేదన
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



రైతులకు విద్యుత్ అందని భూములు

ఉలవపాడు:

సార్.. ఇప్పుడు మామిడి తోటలకు నీరు చాలా కీలకం. ఇప్పుడు నీళ్లు పెట్టకపోతే నష్టపోతాం అని విద్యుత్‌శాఖ అధికారులను వేడుకుంటున్నారు. మండల పరిధిలోని కరేడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 1300 నుంచి 1500 వరకు పొలాలకు విద్యుత్ సరఫరా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరేడు పరిధిలోని ఈ భూమిని రైతులు దిన్నెగా పిలుచుకుంటారు. ఈ భూముల్లో మామిడి, వరి సాగు అవుతున్నాయి. రైతులకు అందించే విద్యుత్ ద్వారా వారు మామిడి తోటలకు నీరు కట్టుకుంటారు, వరి పొలాలకు నీరు పెట్టుకుంటారు. ఈ పరిస్థితుల్లో గత వారం రోజులుగా ఇక్కడ ఉన్న దాదాపు 150 మంది రైతులకు విద్యుత్ సరఫరా రావడం లేదు. దీంతో బోర్లు, మోటార్లు పనిచేయడం లేదు. వేసవి కావడంతో మామిడి తోటలకు నీరు పెట్టాల్సి ఉన్నందువలన రైతులు నీరు పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. లైనులో రిపేరు వచ్చి ఈ ప్రాంతం వరకు విద్యుత్ రావడం లేదు. ఈ విషయం విద్యుత్ శాఖ అధికారులకు చెప్పినా వారు ఇంకా రిపేరు చేయలేదని రైతులు వాపోతున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలనే..

విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వలనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. వారం రోజుల క్రితం కరెంటు రాకపోవడంతో కరేడు లైన్‌మేన్‌కు సమాచారం ఇచ్చామన్నారు. తరువాత కూడా ఆయనకు పలుమార్లు చెప్పినా మరమ్మతులు చేయలేదన్నారు. ఇప్పటి వరకు పట్టించుకోలేదని తెలియచేశారు. ఎక్కడ సమస్య వచ్చిందో కూడా అర్థం కావడం లేదన్నారు. సమస్యతెలిస్తే తామయినా బయట విద్యుత్ సిబ్బందితో ఖర్చయినా మరమ్మతులు చేయించుకునేవారమన్నారు. మామిడి తోటలకు నీరు పెట్టాల్సిన ఈ సమయంలో ఇలా విద్యుత్ నిలిపివేయడం బాధాకరమని రైతులు వాపోతున్నారు. వెంటనే విద్యుత్ శాఖ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కండి



స్వచ్ఛతా ర్యాలీలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, చైర్మన్ అబ్దుల్ గఫార్



చెరుకూరులో చెత్త సేకరణ రిక్షాలను అందజేస్తున్న ఎంపీడీఓ

కనిగిరిరూరల్: స్వచ్ఛత..ప్రతి ఒక్కరి బాధ్యత అని.. స్వచ్ఛ ఆంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని పలువురు వక్తలు అన్నారు. కనిగిరి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర అవగాహన, ర్యాలీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఆర్డీఓ జి.కేశవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గఫార్ పాల్గొని మాట్లాడారు. ఫారెస్ట్ శాఖలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి కె.వినోద్‌కుమార్, అటవీ శాఖాధికారి ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయం, ఆర్టీసీ డిపో, తదితర కార్యాలయాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత చర్యలు చేపట్టారు. స్వర్ణాంధ్ర 2047 సంకల్పంలో భాగంగా ప్రతి మూడో శనివారం పరిశుభ్రతా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి ప్రకాశం, తహసీల్దార్ ఏవీ రవిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ విశ్వనాథరెడ్డి, కమిషనర్ దానియేల్ జోసఫ్, డీఎం మహమ్మద్ సయానా బేగం, ఎంపీడీఓ హనుమంతరావు, ఫారెస్ట్ అధికారులు ఏ శ్రీహరి, సెక్షన్ అధికారులు, ఏఓ ఫ్రాన్సిస్‌బాబు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ ప్రసాద్, మెప్మా టీఎంసీ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పామూరు: స్వచ్ఛ గ్రామాల నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం స్వర్ణఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రంచేశారు. డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, వీఆర్‌ఓలు శ్రీనివాసులు, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ మంజునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పరిసరాలు, రోడ్లు, సైడుకాల్వలు అన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారం వేయకుండా స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యాలయం సిబ్బంది, వీఆర్‌ఓల చేత ప్రతిజ్ఞచేయించారు.



సీఎస్‌పురంలో సిబ్బందిచేత ప్రతిజ్ఞచేయిస్తున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

పొన్నలూరు: పరిశుభ్రమైన గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ డాక్టర్ సుజాత అన్నారు. మండలంలోని చెరుకూరులో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి ఈ-వేస్ట్‌పై గ్రామసభ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు నూతన చెత్త సేకరణ రిక్షాలను అందజేశారు. సర్పంచ్ కాలే అయ్యన్న, ఈఓఆర్డీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



టంగుటూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



కొండపి సీహెచ్‌సీ వైద్యశాలలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారుబాబు

కనిగిరిరూరల్: అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారుబాబు అన్నారు. పట్టణంలోని గోపినాథ్ హాస్పిటల్, ప్రధాన సెంటర్ తదితర ఏరియాల్లో శనివారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి సీహెచ్ బంగారు బాబు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్పత్రి నుంచి ఎలా బయటకు రావాలి, రోగులను ఎలా కాపాడాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగిన తర్వాత తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. డాక్టర్ గోపినాథ్, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

కొండపి: నిప్పుతో చెలగాటం చేయరాదని కొండపి అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ వెంకటరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కొండపి సీహెచ్‌సీ వైద్యశాలలో, దుర్గాదేవి వైద్యశాలలో హాస్పిటల్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖాధికారి వెంకటరావు మాట్లాడుతూ వైద్యశాల పరిసరాల్లో అగ్నిమాపక పరికరాలు ఎప్పుడూ పనిచేసేలా ఉంచుకోవాలని సూచించారు. సీహెచ్ సీ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, ప్రజలు, వైద్యశాల సిబ్బంది,ఫైర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: అగ్ని ప్రమాదాలతో జాగ్రత్తగా ఉండాలని అగ్నిమాపక అధికారి రమణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో శనివారం అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా అగ్నిమాపక కేంద్రం అధికారి రమణారెడ్డి, సిబ్బంది అవగాహన కల్పించారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..రైతులకు శాపం



వాడు ముఖం పడుతున్న మినుము



విరిగిన విద్యుత్ స్తంభం



నేల మీద ఉన్న విద్యుత్ వైర్లు

పీసీపల్లి: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..రైతులకు శాపంగా మారింది. వివరాల్లోకి వెళితే..ఇటీవల గాలి వాన బీభత్సానికి మండల పరిధిలోని గుంటుపల్లిలో తాటిచెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి సపోర్టుగా ఉన్న స్తంభంపై పడి వైర్లు నేలను తాకుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో బోర్ల కింద వేసిన మినుము ఎండుముఖం పట్టింది. దీనిపై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని రైతులు కొండమ్మ, బసిరెడ్డి, చెంచురెడ్డి వాపోయారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 10 మోటార్లు ఉన్నాయని, 10 రోజులుగా సరఫరా లేదని తెలిపారు. లైన్మన్‌ను అడిగితే జేసీబీ ఖర్చులు మీరు పెట్టుకుంటే మరమ్మతులు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి విరిగిపోయిన స్తంభం వేసి సరఫరా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

రన్ ఫర్ జీసస్



రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ ఎస్‌కే ఖాజావలి

కనిగిరిరూరల్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని శనివారం కనిగిరిలో నిర్వహించారు. స్థానిక దుర్గం బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని కనిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఖాజావలి ప్రారంభించారు. కార్యక్రమంలో కుంచం జక్రయ్య, కె.వినయ్, దాసరి విజయ్ కుమార్, తాతపూడి శ్యామ్యుల్ విల్‌ఫ్రేడ్, సంఘం పెద్దలు, స్త్రీ సమాజం వారు, సండే స్కూల్ టీచర్లు, చిన్నారులు, యువకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత భవిష్యత్

ఉలవపాడు: విద్యార్థులు కష్టపడి చదవాలని ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ అన్నారు. శనివారం చాకిచర్ల శ్రీశ్రీనగర్‌లోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకుని రావాలన్నారు. ఉపాధ్యాయులు భాస్కరరావు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అడ్వైజర్ శ్రీనివాసులులు విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు, సమాజం, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ పాత్ర గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

118 పొగాకు బేళ్లు తిరస్కరణ



వేలం నిర్వహిస్తున్న నిర్వహణధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలంకేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 118 బేళ్లను తిరస్కరించారు. వేలం కేంద్రానికి చిన్నవెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 612 బేళ్లను తీసుకురాగా 496 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230, సరాసరి ధర రూ.260.43గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: రైతులు శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచే పొగాకు బేళ్ల వివరాలను బోర్డు అధికారులకు తెలియజేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. కోల్డ్ స్టోరేజీల్లో బేళ్లు ఉంటే బోర్డు అనుమతితోనే వేలం కేంద్రానికి తీసుకురావాలన్నారు. వేలం కేంద్రానికి పొందూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన 434 బేళ్లను తీసుకురాగా 325 బేళ్లను కొనుగోలు చేసి 109 బేల్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.225, సరాసరి రూ.259.20 పలికింది. వేలంలో 19 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

పత్తా లేని సచివాలయ ఉద్యోగులు



కొణిజేడు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

- ఉదయం 11:30 గంటలు దాటినా కార్యాలయానికి హాజరుకాని వైనం



సిబ్బంది కోసం ఎదురుచూస్తున్న రైతులు

టంగుటూరు: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాల్సిన సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఉదయం 11:30 గంటలు దాటినా కార్యాలయాలకు రావడం లేదు. దీంతో పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని కొణిజేడు సచివాలయానికి శనివారం కేవలం వ్యవసాయ శాఖ అసిస్టెంట్, పక్క పంచాయతీల నుంచి ఇద్దరు సర్వేయర్లు మాత్రమే వచ్చారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..కొణిజేడు సచివాలయంలో ఉదయం 10 గంటలకు రీ సర్వే నంబర్ల పట్టాదారుల అనుభవ విస్తీర్ణరానికి 9,10 నోటీసులు ఇస్తామని చెప్పారు. దీంతో రైతులంతా ఉదయం 10 గంటలకే సచివాలయానికి చేరుకున్నారు. కానీ ఉదయం 11:30 గంటలు దాటినా సచివాలయ సిబ్బంది ఎవ్వరూ కార్యాలయానికి రాలేదు. దీంతో సిబ్బంది తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కూడా హాజరుకాలేదు. రీసర్వేలో తూతూమాత్రంగా సర్వే నిర్వహించి వాళ్లకు తోచినట్లు రాసుకున్నారని, తమ గ్రామంలో జరిగిన రీసర్వేలో చాలా అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఇటు ప్రజలకు కానీ అటు రైతులకు అందుబాటులో ఉండటం లేదంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వారిపై చర్యలు తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించండి



వ్యాక్సినేషన్ రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ వాణిశ్రీ

సింగరాయకొండ: గర్భిణులు, చిన్నారులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సక్రమంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ టి.వాణిశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని బైరాగిమాన్యంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. డాక్టర్ వాణిశ్రీ మాట్లాడుతూ టీకాలు వేసిన వారికి ఎంసీపీ కార్డులు ఇవ్వాలని, యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. హెచ్‌ఈఓ మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌ఆలీ, నాగమణి, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇంటర్ విద్యార్థులకు సత్కారం



సాయిరామ్‌ను సత్కరించిన ప్రిన్సిపాల్ సౌజన్య



తన్నీరు సింధును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

సింగరాయకొండ: ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను కాలేజీ ప్రిన్సిపాల్ ఎం సౌజన్య ఘనంగా సత్కరించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బైపీసీ విభాగంలో అత్యధిక మార్కులు 972 సాధించి ప్రథమస్థానంలో నిలిచిన ప్రళయకావేరి సాయిరామ్, సీఈసీలో అత్యధికంగా 851 మార్కులు సాధించిన తన్నీరు సింధులను ఆమె ఘనంగా సత్కరించారు. విద్యార్థులను వీరిని ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలనికోరారు.

ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య

పొన్నలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తారని తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ హరిబాబు కోరారు. మండలంలోని చెన్నిపాడు జెడ్పీ పాఠశాల్లో శనివారం పది మంది విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండి నాణ్యమైన విద్యను బోధిస్తారన్నారు.